Surya (Sunday magazine) dt- 14/04/13





# మెరిసిన 'మెట్రో'

★ మెట్రోకు అంతర్జాతీయ ఖ్యాతి
★ ప్రపంచ ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌గా ఎంపిక
★ మనవాళ్లకు న్యూయార్క్‌లో అరుదైన గౌరవం
★ గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్‌ది ఇయర్-2013

మెట్రోరైల్ పేరు వినగానే ముందుగా అందరికీ గుర్తుకు వచ్చే వ్యక్తి దాని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి. ఈ ప్రాజెక్ట్ తెరపైకి వచ్చిన నాటి నుంచి అన్నీ అవాంతరాలే... అందరి మనసుల్లో ఒకటే అనుమానం. ప్రాజెక్ట్‌ను అనుకున్న సమయానికి సజావుగా పూర్తి చేయగలరా... అని. అలాంటి ప్రశ్నలకు జవాబుగా ఎన్వీఎస్ రెడ్డి నిలిచారు. నిరంతరం శ్రమించి పనులను వేగవంతం చేశారు. 14,132 కోట్ల వ్యయంతో 71.16 కిలోమీటర్లు. మూడు కారిడార్ల పరిధిలో ప్రాజెక్టును ఒక కొలిక్కితీసుకు వచ్చారు. అంతటి శ్రమకు మెట్రో అంతర్జాతీయ ఖ్యాతిని దక్కించుకోంది. ప్రపంచంలోని నూరు మౌలిక వసతుల ప్రాజెక్ట్‌ల్లో హైదరాబాద్ మెట్రోరైల్ ఈ సంవత్సరపు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. ఇటీవల న్యూయార్క్‌లో ప్రపంచ మౌలిక వసతుల నాయకత్వ సమావేశం గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీడర్‌షిప్ ఫోరం ఆధ్వర్యంలో జరిగింది. అందులో మెట్రోరైల్ ప్రాజెక్ట్ ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ 'గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్-2013' పురస్కారం పొందింది.



వివిధ దేశాల్లో... ముఖ్యంగా ఎన్నికలలో విజయావకాశాలకు అనుగుణంగా నిర్ణయాలు జరిగే ప్రజాస్వామ్య దేశాలలో తగినమేరకు మౌలిక వసతుల కల్పనకు పెట్టుబడులు జరగడంలేదని, దాని వలన దీర్ఘకాలంలో ఆయా దేశాలు ఆశించిన ఆర్థిక ప్రగతిని సాధించలేక పోతున్నాయనే ధృక్పథంతో మౌలిక రంగ ప్రణాళికల్లో నిష్ణాతులైన అనేక దేశాల నిపుణులు ఏకమై గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీడర్‌షిప్ ఫోరంను ఆరేళ్ల క్రితం స్థాపించారు. ఫోరం వార్షిక సమావేశం ఏటా ఒక ప్రపంచ నగరంలో మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతోంది. దానిలో భాగంగా 2013 లో న్యూయార్క్‌లో జరిగింది.

### పురస్కార ఎంపిక ఇలా...

వివిధ దేశాల్లో నిర్మించబడుతోన్న మౌలిక వసతుల ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిలో ముఖ్యమైన నూరు ప్రాజెక్టలను ప్రతి ఏటా ఫోరం ముందుగా ఎంపిక చేస్తోంది. 'స్ట్రాటజిక్ 100' గా పేర్కొనబడే ఈ వంద ప్రాజెక్టులను అవి ఏవిధంగా, అనగా... వాటి ప్రాంతాల, దేశాల ఆర్థికాభివృద్ధికి, ఉత్పాదకతకు, పోటీ పటిమకు, ఉద్యోగ అవకాశాలకు, ఇంధన సామర్థ్యానికి, కాలుష్య నివారణకు తోడ్పడతాయో నిశితంగా పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతోంది.

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్...

"మూడు రోజులపాటు జరిగే సదస్సులో ఆయా ప్రాజెక్టుల సారథులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. ఒక్కొక్క ప్రజెంటేషన్‌కు ఇచ్చిన సమయం 10 నిమషాలు మాత్రమే. ఆ సమయం లోపల ప్రాజెక్టుకు, దేశానికి సంబంధించిన అంశాలను క్లుప్తంగా వివరించాలి. అనంతరం ఐదు నిమషాలపాటు చర్చ జరుగు తోంది. వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పవలసి ఉంటుంది. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు మూడు రోజులపాటు సమాంత రంగా ప్రెజెంటేషన్లు జరుతాయి. వీటి ఆధారంగా వాటిలో 5 విభాగాల్లో ప్రపంచపు అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసుకోవడం జరుగుతోంద"ని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా భాగస్వామ్య పద్ధతిలో ప్రాజెక్టు లను ఎలా నిర్మించగలుగుతున్నారు? వచ్చే ప్రతిఘటనలను ఎలా అధిగమిస్తు న్నారు? అనే విషయాలను అక్కడకు వచ్చిన ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. మెట్రోరైల్ ప్రాజెక్టు ప్రణాళికా విధానాన్ని, ఆర్థిక, ఇంజనీరింగ్ ఆవిష్కరణలను (ఇన్నో వేషన్లను) న్యూయార్క్ మెట్రో పాలిటన్ ట్రాన్స్ పోర్టేషన్ అథారిటీ అధ్యక్షురాలు నూరియా ఫెర్నెండెజ్ అభినం దిస్తూ... "ఆర్థిక కష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటోన్న అమెరికా కూడా ఇటువంటి విధానాన్ని అవలంభిస్తే బాగుంటుంది" అని సూచించారు. అనంతరం జరిగిన పురస్కారాల కార్యక్రమంలో... ఈ పురస్కారాలు మౌలిక వసతుల కల్పనా రంగపు ఆస్కార్ అవార్డులని చెబుతూ... గ్రోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫోరం అధ్యక్షుడు నార్మన్ ఆండర్‌సన్ ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రోరైల్ ఎంపికైనట్లు ప్రకటించారు. అవార్డును మెట్రో ఎండీ ఎన్వీస్‌రెడ్డి, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి బూసి శ్యాంబాబు, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి ఆయన నుంచి స్వీకరించారు.



### అర్హత సాధించిన మూడు ప్రాజెక్టులు...

1. అజర్‌బైజాన్‌కు చెందిన ట్రాన్స్ అనటోలియన్ గ్యాస్ పైప్‌లైన్ (7మిలియన్ డాలర్లు: రూ. 37,800 కోట్లు)
2. భారత్‌కు చెందిన హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు (2,66బిలియన్ డాలర్లు: రూ 14,132 కోట్లు)
3. కువైట్‌కు చెందిన అల్ అబ్దాలియా సోలార్ ప్లాంట్ ఉన్నాయి.

– ప్రసాదుల బాబూరావు, సిటీబ్యూరో, మేజర్‌న్యూస్.